27-4-2000

# కార్పొరేట్ వాదనకు 'కలిసొచ్చే' కరవు

**కరవు ఎప్పుడొచ్చినా పేదరైతు భూమిని తెగనమ్ముకుని మరో చోటికి తరలిపోవడం సర్వసాధారణం. మళ్ళీ మరో పేద రైతే ఆ భూమిని కొనుక్కుంటే మళ్ళీ కరవు, మళ్ళీ అదే కథ పునరావృతం కాకతప్పదు. కనుక హోల్ మొత్తంగా పేద రైతుల భూముల్ని కార్పొరేట్ సంస్థలు కొనేసుకుంటే?! మొత్తానికి కరవు కూడా కార్పొరేట్ వ్యవసాయానికి ఎంతబాగా పనికొచ్చేలా ఉందో!**



కె.బాలగోపాల్

తమిళనాడులో టీ ఆకు పండించే చిన్నరైతులు, కాశ్మీర్‌లో ఊలు అమ్ముకొని బతికే గొర్రెల పెంపకం దార్లు, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆపిల్ పళ్లతో టలు పెట్టుకున్న చిన్నరైతులు తమ భవిష్యత్తు గురించి చెందుతున్న ఆందోళన ఆయా రాష్ట్రాల పత్రికలు ప్రముఖంగానే రాస్తున్నాయి. ఊలుకూ ఆపిల్ పళ్లకూ తేయాకుకూ సంబంధమేమిటా అని ఆశ్చర్యపోవద్దు. ఒకసంబంధం ఉంది. మారుతున్న ప్రపంచ వాణిజ్య నియమాలననుసరించి దేశంలోకి పెద్దఎత్తున దిగుమతి అవుతున్న గ్రామీణ ఉత్పత్తులు ఇవి. ఇంకా ఇతర రాష్ట్రాలలో ఇటువంటి సరకులనేకం ఉన్నాయి.

దిగుమతుల పోటీవల్లవీటి ధరలు పడిపోయి రైతులుగతంలో ఎన్నడూ లేనంతగా నష్టపోతున్నారు. ఒకవేళ దిగుమతులతో నాణ్యత విషయంలో మనరైతుల ఉత్పత్తులు పోటీ పడగలిగినా, 'మార్కెటింగ్'లో పోటీ పడలేరు. ఉత్పత్తులు ఎంతనాణ్యమైన వనేది కాదు, ఎంత సమర్థంగా వాటిని 'మార్కెట్' చేయగలరనేది అమ్మకాన్ని నిర్ణయిస్తుంది. ఈ 'మార్కెట్' చేయగలగడం అనేదాన్ని నిర్ణయించే విషయాలలో సరకునాణ్యత ఒకటి మాత్రమే.

అందుకే వ్యవసాయ ఉత్పత్తులలో కూడా స్వేచ్ఛావిపణిని ఏర్పాటు చేస్తే అది 'మన రైతులు కూడా ఉపయోగించుకోగల వ్యవస్థ' కాగలదనుకోవడం భ్రమ. వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచీకరణను సమర్థించేవాళ్లు ఈమాటే అంటున్నారు. ఆస్ట్రేలియా ఆపిల్ పళ్లు మన మార్కెట్‌లోకి వచ్చి కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ ఆపిల్‌తోటలు నష్టపోతే పోవచ్చునుగానీ, పంజాబు ఆలుగడ్డలు ఆస్ట్రేలియాకు ఎగుమతయి వాటిని పండించే రైతులు బాగా లాభాలు సంపాదించుకోగలరనీ, మొత్తమీద వ్యవసాయంలో అపారమైన అనుభవం ఉన్న మన రైతులే లాభాలు ఎక్కువ పొందగలరనే రైతుల పట్ల సానుభూతిగలవారు సైతం వాదిస్తున్నారు.

అమ్మకపు మార్కెట్ల మీద ఆధిపత్యం నెలకొల్పే పద్ధతుల గురించి అవగాహన సరిగ్గా లేకపోవడం వల్ల కలిగే అభిప్రాయాలివి. వ్యవసాయ ఉత్పత్తుల ప్రపంచీకరణ నుండి మనంకూడ ప్రయోజనం పొందాలంటే ఇతరదేశాల మార్కెట్లలో ఎటువంటి ఉత్పత్తులకు గిరాకీ ఉందో తెలియాలి. అటువంటి ఉత్పత్తులు చేపట్టడానికి అవసరమయిన పెట్టుబడులు పెట్టగలగాలి. ఇతర మార్పులు చేసుకోగలగాలి. ఉత్పత్తి అయిన సరకును నిలువఉంచే పద్ధతిలో ప్యాకింగ్ చేసి రవాణా చేయగలగాలి. ఆకర్షణీయంగా ప్రచారం చేసి అమ్మగలగాలి. ఒక్కమాటలో చెప్పాలంటే వ్యవసాయంలో మెలకువలు తెలిస్తే చాలదు, 'అగ్రి బిజినెస్' తెలియాలి. పాశ్చాత్యదేశాలు మనం వాడే పురుగుల మందుల పైననో ఎరువుల పైననో నెపంపెట్టి మన ఎగుమతులను అడ్డుకోకుండా ఉంటారనుకున్నా, అభివృద్ధి చెందిన వ్యవసాయ వ్యాపార వ్యవస్థ లేనిదే మన వ్యవసాయ దారులు ఈ ప్రపంచీకరణ వల్ల ప్రయోజనం పొందలేరు.

అది నెమ్మదిగా అభివృద్ధి చెందుతుందనుకోవచ్చు. కానీ అంతవరకు ఆగితే చంద్రబాబు వంటి నాయకులు కోరుకునే విపరీతమైన పెరుగుదల రేట్లు ఎక్కడినుండి వస్తాయి? కాబట్టి ఈలోపలే మన వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లోకి ప్రవేశించాలంటే 'అగ్రి బిజినెస్' లో ఆరితేరిన విదేశీ కార్పొరేషన్లనే మళ్లీ ఆహ్వానించి మనభూములను మన రైతులనూ వారికి అప్పగించడానికి మన పాలకులు సిద్ధపడుతున్నారు.

అంటే విదేశీ కార్పొరేషన్లు చేసే వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల వల్ల పోటీకి తట్టుకోలేని మన రైతులు పతనమైతే, ఎగుమతులు మనకు చేతకావు కాబట్టి తిరిగి అవే కార్పొరేషన్లను దేశంలోనికి ఆహ్వానించి వాటిద్వారా ఎగుమతులు చేసి మన రైతులు 'ప్రయోజనం' పొందాలి. రెండువైపులా బహుళజాతి అగ్రి బిజినెస్ కార్పొరేషన్లకు మేలు చేసే విధానం ఇది.

దీని ఫలితంగా దిగుమతులవల్ల మన రైతులు నష్టపోగా ఎగుమతుల వల్ల వచ్చే లాభం కార్పొరేషన్ల జేబుల్లోకే పోతుందనే దొక్కటే మన బాధ కాదు. అగ్రి బిజినెస్‌తో ముడిపడిన ఎగుమతీ రంగంలోకి ప్రవేశించిన రైతుల జీవితాలు చాలా అభద్రంగా ఉంటాయనేది కూడ చాలా ఆందోళన కలిగించే విషయమే. పెట్టుబడి పెట్టిన తరువాత ఆ పంటకు ఆ సంవత్సరం అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ లేదని ఆ కంపెనీ కొనుక్కోకపోవచ్చు. రైతులదగ్గర మిగిలిపోయిన పంటను కొనుగోలు చేసి భద్రపరిచి తిరిగి మార్కెట్‌లో గిరాకి ఉన్నప్పుడు అమ్ముకునే ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు ఇకమీదట ఉండబోవని మన పాలకులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి ఆ రైతుల గతేంకావాలి?

లేదా ఈ సంవత్సరం లాగ కరవుతీవ్రంగా వచ్చిందనుకోండి. ఈ సంవత్సరం గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలలో జిల్లాలకు జిల్లాలే తరలిపోయిన రైతుల భూములు ఏ అగ్రి బిజినెస్ కంపెనీతోనో ముడిపడిన భూములనుకోండి. మెట్టపంటలకు కూడ ఆ భాగ్యం కలిగిస్తామని మన పాలకులు అంటున్నారు. కాబట్టి ఇందులో ఊహకందనిది ఏమీ లేదు. ఈ సంవత్సరంవారు ఆ కంపెనీ నుండి అప్పుచేసి లేదా అడ్వాన్స్ కింద —తెచ్చుకున్న పెట్టుబడిని కోల్పోవడమేకాదు, వచ్చే సంవత్సరం వానలు బాగాకురిసినా తిరిగి పంటవేయడానికి వారికి పెట్టుబడి దొరకడం కష్టం. కాబట్టి వారితో వ్యాపార సంబంధమే తప్పవేరే ఏ సంబంధం లేని కంపెనీ ఇంకవీరితో లాభంలేదని వేరే ఎక్కడో తనకు కావలసిన సరకు నిచ్చే రైతులను వెతుక్కుంటుంది. వీళ్ల పాత బాకీ ఉండిపోతుంది. గిరాకీ తరలిపోతుంది. తిరిగి మళ్లీ ఒక కొనుగోలు దారును వెతుక్కొని స్థిరపడాలంటే ఒక కరవుకాదు, రెండు కరవులు దాటాలి. 'అగ్రి బిజినెస్'తో వ్యవసాయాన్ని బంధించే ప్రయత్నం మరీ ఇంత దూరంసాగకముందే పత్తిరైతుల ఆత్మహత్యల వార్తలు విరివిగా వింటున్నాం. ఇంక రేపేంకానుందో! ఈ చిత్రం మన పాలకుల ఊహలకు అందకపోలేదు. అందుకే రైతులను అగ్రి బిజినెస్‌తో ముడిపెట్టే ఈ అస్థిరమైన వ్యవస్థకంటే, కంపెనీలే రైతుల భూములు కొనేసి, లేక లీజుకు తీసుకొని వారిని కూలీలుగా పెట్టుకొని పనిచేసుకునే ఏర్పాటే మంచిదని వారు అంటూనే ఉన్నారు.

ఈ 'ముందుచూపు' అందరికంటె మొదట చంద్రబాబు ప్రదర్శించారు. రెండు మూడెకరాల రైతులను ఉండనిచ్చి, వారి చేతకాని వ్యవసాయాన్ని కార్పొరేషన్లతో ముడిపెట్టడం కంటె వారి భూములను కార్పొరేషన్లకే చేరవేసే ఏర్పాటు చేసేస్తే 'రాష్ట్ర ఆదాయం' మరింత వేగంగా పెరుగుతుంది కదా (అందులో చిన్న రైతుల ఆదాయం తగ్గితే తగ్గిందిగాక) అని ఆయన విజన్ 2020 రాయించిన నాటినుండి అంటున్నారు. 'చిన్న వ్యవసాయాలు దండగ' అని చాలా ఉద్ధృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ దండగమారి చిన్నరైతుల కమతాలను వ్యవసాయ వ్యాపారం చేసే పెద్దరైతులకు, లేక కంపెనీలకు బదలాయించే అవకాశం లేకుండా చేసే భూసంస్కరణల చట్టాలు సవరించాలని అంటున్నారు.

నిన్నగాక మొన్న అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఈ మాటే అంది. భారతదేశంలో పేదరికం తొలగకపోవడం విచారకరం అని అంతర్జాతీయ ద్రవ్యనిధి అన్నదని పత్రికలలో చదివి అందరూ ఆశ్చర్యపోయే ఉంటారు. అయితే ఈ వార్తను తరచి చదివితే ఆ సంస్థ దృష్టిలో ప్రధానమైన అభ్యంతరమేమిటో అర్థం అవుతుంది. 'కమతాల పరిమాణం పైన ఉన్న పరిమితులను సడలించలేకపోవడం' ఒక అవరోధమనీ 'కార్మికుల తొలగింపు పైన ఉన్న నియంత్రణను సడలించలేకపోవడం' మరొక అవరోధమనీ అంతర్జాతీయ ద్రవ్యనిధి అన్నది. మామూలు మాటలలో చెప్పాలంటే భూసంస్కరణ చట్టాలను రద్దుచేయాలి, కార్మిక చట్టాలను 'సరళతరం' చేయాలి.

ఈ సంవత్సరం దాదాపు దేశవ్యాప్తంగా నెలకొన్న కరవును కూడ ఈ సూచనలకు బలం కలిగించడానికి వీరు వాడుకోగలరు. కరవెప్పుడొచ్చినా పేద రైతులు భూములమ్ముకొని పోవడం దానికి గల ఒకానొక ఫలితంగా ఉంటున్నది. ఆ భూమిని మరొక పేద రైతు కొనుక్కుంటే పరిస్థితిలో ఏమార్పూ రాదనీ, పెద్దరైతులు కొనుక్కోవడానికి సీలింగ్ చట్టాలు అడ్డమున్నాయనీ, కార్పొరేషన్లేగనక ఊర్లు ఖాళీచేసి పోతున్న దిక్కుమాలిన రైతులందరి భూములనూ కొనేసుకోగలిగితే సీలింగ్ చట్టం అడ్డం రాకుండా ఉంటే గుజరాత్‌లోగానీ రాజస్థాన్‌లోగానీ ఇంకొకసారి ఎప్పుడూ కరవు రానంత అభివృద్ధి వచ్చేసేదని ఈ సంవత్సరం తిరిగే లోపల మేధావులు వాపోబోతారని కచ్చితంగా చెప్పగలం. చాలా మంది అవునవబోతారని కూడ చెప్పగలం.



